# లెఫ్టెనెంట్ తులసి

## ప్రథమాధ్యాయం

మధ్యాహ్న సూర్యుడు ఆసుపత్రి ఆవరణలో శుభ్రంగా సుందరంగా ఉన్న గడ్డి బయుళ్ళమీద అక్కడక్కడున్న చెట్లనీడలను చిత్రిస్తుంటే సన్న సన్న గాలి ఆ నీడలను పెంచుతూ దించుతూ ఉంది.

ఓ ప్రక్కన ఓ బెంచిమీద ఇద్దరాడువారు కూర్చొని ఉన్నారు. ఒక ఆమె నలభై యైదేండ్లు కలిగి నిదానమైన దృష్టి నిరాలంబమైన దుస్తులూ వేసుకుని ఉంది.

రెండవ యామె ఇరువై యేండ్లకు లోపుగా ఉన్నట్లున్నది. ఖాకీ జాకెట్టుమీద రెండు లెఫ్టెనెంటు పూలున్నాయి. చీరెమాత్రం వెడల్పైన జల్తారుగల తెల్లచీరె.

మొదటి యామె యువతివంక జూచింది. ఆ పుష్పమువంటి మోము, జారుజారుగా అల్లికల్లికగా ఉన్న తలముడి జూచింది. ఆమెతో ఇట్లన్నది :-

"తులసీ! సెలవుమీద ఇంటికి వెళ్ళడం అంటే అందరూ సంతోషిస్తారే! నీవేల విచారపడుదువూ? కూడదు. ఇక్కడేమి శాశ్వతమా! పోయి సామాను సర్దుకుని మిగతా నీ స్నేహితులతో తెల్పి బయల్దేరు."

"మా మేనత్త ఒక్కతే గాదండీ మద్రాసులో ఉంది! నేను ఎం. బి. బి. యస్. చదవడమే ఆవిడ కిష్టంలేదు. మా నాయన వీలులో వ్రాయకపోతే నా స్కూలుఫైనలు పరీక్షతోనే పెండ్లి చేసేది. తాను మాత్రం డ్యాన్స్‌లూ పార్టీలూ తిరగాలి. నన్ను జూస్తే తన కిష్టమైన వాడ్నెవరైనా నాకు పెండ్లి చేయాలి. ఇప్పుడు నాకు పందొమ్మిదిపోయి ఇరవై మాత్రం. ఇరవై వకటి వాటితేగాని స్వతంత్రురాలను కాను. ఈ లోపల ఎక్కడుంటేనేం!"

"అట్లాగాదమ్మా సంవత్సరమైంది నీవు మిలిటరీలో చేరి. ఇక్కడున్న మిగతావాళ్ళ మాదిరి దానివి కావు. ఆస్తి ఉంది. ఐశ్వర్యముంది. విద్య ఉంది. పైగా గుణం ఉంది. నీ కెక్కడున్నా భయంలేదు. అయితే సెలవు తీసుకోకపోతే శరీరం అస్వస్థత పడుతుంది....

పదిరోజుల్లో నే నసలే డిస్చార్జి తీసుకుని నా పాత స్కూలు మేనేజరు పనికి నేను పోతున్నాగదా. నే నీ సీనియర్ నర్సుగా మూడేండ్లయింది వచ్చి. ఇంక ఉండను. నా యెడ్రసు తెలుసుగా నీకు. మద్రాసులోనే! ఎప్పుడు పడితే అప్పుడు నన్ను చూడవా !"

"సరే కాంతాబాయిగారూ! మీరంటేనే యెంతో ధైర్యం. వెళ్ళుతాలేండి !"

ఇద్దరూ లేచి ఆసుపత్రి ఆవరణలోనే ఉన్న నివాసమందిరాలకు పోయారు.

లెఫ్టెనెంట్ తులసి నిజానికి పెద్ద ఆస్తిమంతురాలు. ఆమె తండ్రి జిల్లా జడ్జిచేసి మద్రాసులో ఇల్లు కట్టుకుని చనిపోయాడు. అప్పుడు కూతురు తులసి స్కూలుఫైనలు ప్యాసయింది. ఎం. బి. బి. యస్. కు పంపాలెనని ఆయనే ఉద్దేశించాడు. ఆమెకూ ఆస్తికీ గార్డియనుగా తన చెల్లెలు రాంబాయిని నియమించాడు.

రాంబాయి ఎం. ఏ. ప్యాసయిన ఆవిడ. ఆమె భర్త ముత్యాలూ రత్నాలూ వ్యాపారంచేసి చాలా గణించి ఆమెకిచ్చిపోయాడు. అప్పట్నుంచీ ఆమె నిర్వాహకురాలైంది. పదేండ్లనుంచీ మళ్ళీ వివాహం చేసుకుందాం అనుకుంది గాని తప్పిపోతున్నది. ఇప్పుడావిడకు ముప్పైరెండేండ్లుంటా యేమో! తా నాస్తిమంతురాలైనా మేనకోడలి ఆస్తి మేనేజిమెంటులో గూడా మిగలకపోలేదు.

ఈ సంగతులే ఆలోచించుకుంటూ హాలులో అడుగెట్టింది తులసి. హాలులో ఇంకా అయిదారుగురాడవాండ్లు పింగ్‌పాంగ్ మొదలైనవాడుతూ కూర్చున్నారు. అందులోంచి శారద అనే సెకండ్ లెఫ్టెనెంటు తులసిని చూసి ఎకాయెకి ఆమె దగ్గిర కొచ్చింది.

"ఏం అదృష్టమోయి నీది! సెలవుల్లో ఇంటికెళ్ళుతున్నావు! నా కింకా ఐదునెలలైతేగాని సెలవు లివ్వరు. వెళ్ళంగానే పెండ్లి చేసుకుంటావేమో సుమా" అంది శారద.

అక్కడి వారందరిలోకీ తులసీ శారదా చిక్కని స్నేహితులు. డ్యూటీలో తప్ప ఎప్పుడూ కలిసే ఉంటారు. సరస సరస గదులు.

"పెండ్లంటే అంత చులకనా! అయినా మా మేనత్త చూపించే వాళ్ళను మాత్రం పెండ్లాడను. అందులో నా కింకా ఏడాదిపైనుంది పూర్తి

మైనారిటీ దాటడానికి. అందాకా అనుకోకూడదు. అసలా సంగతెందుకు పోనిద్దూ!" అన్నది తులసి.

"నీకు వెళ్ళింతర్వాత పిచ్చిపిచ్చిగా ఉంటుంది తులసీ. ఆర్నెల్లనుంచీ మంచి స్నేహంగా ఉన్నాం ఇక్కడ. పోనీలే! మా అన్నయ్య కిదివరకు చాలాసార్లు రాశాను. నీకు తెలుసుగా! మనిద్దరం కలిసి తీసుకున్న ఫొటో గూడా పంపాను. దాంతోపాటు నువ్వు లెఫ్టెనెంటు డ్రెస్సులో ఉండగా ఒంటరిగా తీసుకున్న ఫొటోగూడా పంపాను. మా బాగుంది. మనిషినే ఎప్పుడు చూస్తానా అని కలవరిస్తున్నానని రాశాడు. మీ ఇద్దరూ పెండ్లి చేసుకుంటే ఎంత బాగుంటుంది! అతనూ డాక్టరుగా వెయ్యిపైన సంపాయిస్తున్నాడు!"

"సంపాదనొక్కటేనుటోయి ముఖ్యం పెండ్లికీ? అయినా ఊరుకుందూ! మద్రాసులో ఆయన కనబడుతాడుగా!" అంది తులసి.

ఆనాడు సాయంత్రమే రైలెక్కింది.

* * *

తులసి మద్రాసు ఇంటికి చేరింతర్వాత మేనత్త రాంబాయి షాపింగ్ అని బజారు బయల్దేరింది తులసిని కూడా వేసుకుని. వాళ్ళిద్దరూ కారులోంచి దిగి ఏదైనా షాపులోకి పోతున్నప్పుడల్లా దారేపోయేవాళ్ళు తులసిని చూసి ఒక్క నిముషం ఆగిపోయేవాళ్ళు.

తులసి తెల్లచీరె కట్టిందిగాని గళ్ళరవిక తొడిగింది. కాలికి రంగూన్ చెప్పులు. పెద్ద ఆడంబరంలేదు. కాని వెయ్యిమందిలో ఒకతే అనే ముఖం. గర్వంలేదు. ఎప్పుడూ చిరునవ్వు ఒలుకుతూంటుంది. నయనాలమాయకత్వం తెలుపుతూంటాయి. ఆమెను చూచినవాళ్ళు నిజంగా యుద్ధంలో మనదేశపు సిపాయిలు బాధపడుతున్నారు గనుక సేవచేద్దామని పోయిన ఉదార హృదయగా ఉంది గాని చలాకీగా వెళ్ళిన మనిషికాదని తెలుసుకుం

టారు. నిజం అంతే. లేకపోతే సాలుకు ఏడెనిమిది వేలొస్తాయి తండ్రిచ్చిన ఆస్తివల్ల. తాను ప్రాక్టీసు పెట్టుకోవచ్చు. మరింకెందుకూ! తులసిని చూసి మేనత్త రాంబాయి—"ఫరవాలేదు. ఈ పిల్లకు పెళ్ళి త్వరగానే అవుతుంది. ఆడదానికి ఉద్యోగం ఏమిటి—మొగుడ్నీ పిల్లలనూ చూచుకోకుండా!" అనుకుంది.

ఇద్దరూ పూలంగడికి పోయారు. "గులాబీలు తీసుకుంటావా—మల్లెలు తీసుకుంటావా?" అని అడిగింది రాంబాయి.

"రాంబాయిగారూ, ఈ పిల్లెవరు—మీ మేనకోడలేనా?" అని ఎవరో పలకరించారు.

"ఓహో! రావుగారా! మీరుగూడా మిలిటరీ పోయారుగదూ! ఎప్పుడొచ్చారూ? ఈ పిల్లా? అవును నా మేనకోడలే! తులసీ! ఈయనెవరో తెలుసునా? ఈయన తండ్రీ మీ తండ్రీ, గొప్ప స్నేహితులు. ఈయన చెలకలపూడి జమీందారు తమ్ముడు. రావు విజయేంద్రరావు!" అన్నది రాంబాయి.

"మల్లెలూ తీసుకోవాకండి—గులాబీలూ తీసుకోవాకండి. పిల్లకట్టిన చీరె మల్లెపూవల్లే వుంది. బుగ్గలు గులాబీలల్లే ఉన్నాయి. ఇహ మల్లెలెందుకు, గులాబీలెందుకు? కొప్పుచుట్టూ రంగవల్లీ పూలూ — మధ్యలో సంపెంగ పూలూ—మహా అందంగా ఉంటాయి. చూడడానికి రంగవల్లులూ, సువాసనకు సంపెంగలూ!" అన్నాడు రావు.

రాంబాయి నవ్వింది. ఇదివరలో రెండు మూడుసార్లు రావును తానే బుట్టలో వేసుకుని పెండ్లాడుదామనుకుంది. రావు లొంగలేదు. స్నేహమూ విడవలేదు. అతనికి ముప్పైయైదుదాకా ఉంటాయి. ముదిరిన మనిషైనా స్ఫురద్రూపి. పొడుగూ, పొడుగుకు తగిన శరీరం, అందమైన ముక్కూ, ఆ మనిషిని చూసి చాలామంది పిల్లల నిద్దామనుకున్నారు. మద్రాసు

సొసైటీలో చాలామంది ఉరులు వేశారు. ఎవరికీ చిక్కలేదు రావు. ప్రపంచానుభవం చాలా ఉన్నవాడు. రకరకాల కూరలు రుచి చూసినవాడు. అతని ముఖంమీద కొంత అరితేరినతనమూ, కొంత రాయితనమూ కనబడుతూంటాయి. చంచలత్వం ఉన్నట్టు చూపిస్తాడు కాని అది ఇతరుల కోసం — వస్తుతా లోతైనవాడు.

రావు మాటలు విని "నీ వసలేదో కవిగా ఉండవలసిందోయి రావూ!" అన్నది రాంబాయి.

"ఇటువంటి సొసైటీలో మనిషి సహజంగా కవి అవుతాడు!" అన్నాడు తులసిని చూస్తూ.

"సరే! రంగవల్లులూ, సంపెంగలూ తీసుకో అత్తయ్యా" అంది తులసి చిరునవ్వుతో.

రావును చూసినప్పట్నుంచీ అటువంటి వాణ్ని ఎప్పుడూ చూడలేదనుకుంది తులసి. అతనన్న పూలనే తీసుకో అని తులసి అన్నప్పుడు అతని ముఖంపై కలిగిన వికాసం చంద్రకాంతపు శిలపై వెన్నెల విరిస్తే ఉన్నట్టుగా కనబడ్డది.

ఆమె చిరునవ్వు చూసినప్పుడాతను ఇంతకన్న లేత గులాబీని నేనెక్కడా చూడలేదు అనుకున్నాడు. రాంబాయీ తులసీ పూలు తీసుకున్నారు. అతని మిలిటరీ డ్రెస్సునూ మూడు పూలనూ చూసి "మీకు సెల్యూట్ చేయాలనేమో—నేను లెఫ్టెనెంటునేకాదూ!" అన్నది తులసి అదే చిరునవ్వుతో.

"లేడీసుకు ప్రివిలేజ్ ఉందిగాదూ! అందులో మీరు సివిల్ దుస్తుల్లో వున్నారు గనుక మిలిటరీ రేంకులు ఇక్కడ పనికిరావు. సౌందర్యానికి నేనే సెల్యూట్ చేస్తున్నాను!" అని బూట్లు క్లిక్ మనిపించి మహా వయ్యారంగా సెల్యూట్ చేశాడు.

ఆ అమాయిక తులసి ఎవరైనా ఏమైనా అనుకుంటారని గూడా యోచించకుండా పకపకా నవ్వి "ఇదుగో తిరిగి సెల్యూట్" అని వెనక్కి తిరిగి "రా అత్తయ్యా" అన్నది.

"ఓసీ, నీకెంత యీడొచ్చినా చిన్నతనం పోలేదేమే!" అంటూ "రేపు మా యింటికి రావోయి. నిన్ను చూసి చాలా రోజులైంది" అని క్రీగంట చూస్తూ కారెక్కింది.

వారి కారు పోతూంటే రావు మనస్సులో అనుకున్నాడు :-

సుఖంగా సుఖంగా సుఖంగా
గంటకూ గంటకూ గంటలున్నాయి !
సుఖంగా సుఖంగా సుఖంగా
పంటకూ పంటకూ పూవులున్నాయి!

* * *

మర్నాడు రాంబాయి మేడకు చేరాడు రావు. హాలులో వారూ వీరూ కొంతమంది ముచ్చటలాడుతూ కొంతమంది టీ తాగుతూ కులాసాగా కూర్చున్నారు. రావుకు తులసి కనబడలేదు. అటూ ఇటూ చూశాడు. లోపల గడపలోంచి అతన్ని చూసి వచ్చింది రాంబాయి, "తులసికోసం చూస్తున్నట్టున్నాడు!" అనుకుంటూ కొంచెం కోపంతో. "ఈతని యీడుకు నా యీడు మనిషి జతగా ఉంటుందిగాని ఇరవై ఇంకా దాటలేదు, తులసి ఈడవుతుందా! దానికేమి అనుభవం ఉంది—ఓ యేడాది మిలిటరీ పోయింది అంతేనా! చదువుకున్నది—అంతేనా! ఇప్పటికింకా చిన్నతనం వదల్లేదు దానికి. ఛీ ఈ మొగాళ్ళకు మెదళ్ళు లేవు!" అనుకుంది.

పాపం నిజానికి రాంబాయీ అందమైన మనిషే! ముప్పైఏదాటేదాకా రాంబాయి ఇంటికివచ్చి అయిదు నిముషాలైనా ముచ్చటలాడిపోని గొప్ప వాళ్ళు లేరు. ఈ మధ్య రెండేండ్ల నుంచే కాస్త వాడుతనం వచ్చింది.

అనేకాలోచనల కది సమయంకాదు. అతిథులున్నారు. రావును చేరి "తులసి ఇక్కడలేదు రావూ! స్నేహితురాలెవర్నో చూడడానికి పోయింది. సాయంత్రందాకా రాదనుకుంటాను. పాపం నిన్న కారు డ్రైవు చేసేప్పటికి పడిశం పట్టినట్టుంది—నీళ్ళు భేదించినై యేమో! దా! కూర్చో! టీ తీసుకో!" అన్నది.

"అరే పాపం! సాయంత్రంరాగానే ఆవిరిలో యూకలిప్టస్ వేసి పీల్చ మనండి. త్వరలో నయం అవుతుంది" అన్నాడు రావు. అతని ముఖంలో చలనంలేదు. తులసి లేదనే విచారం చూపలేదు.

తాను చెప్పినమాట నమ్మినాడో లేదో అనుకుంది రాంబాయి. టీ ముట్టీముట్టకుండానే అతను 'పని ఉంది' అని సెలవు తీసుకుని పోతుంటే అర్థంకాలేదు. తులసిని కలవకుండా వెళుతున్నాడులే అని మాత్రం సంతోషించింది.

రాంబాయి సంతోషం సెకండ్లు గూడా ఆగలేదు. రావు వాకిలి గడప చేరేప్పటికి లోపలికి వస్తున్నది తులసి.

తులసిని చూసి రావు "నీవు సాయంత్రందాకా రావనుకున్నాను. నీ వొంట్లో సుస్తీ ఎలా ఉంది?" అన్నాడు

"నాకు సుస్తీ ఏమీలేదే! పాపం యీ కుక్కపిల్ల అరుస్తుంటే తోటలో అటూ ఇటూ తిప్పి తీసుకొస్తున్నా!" అంది తులసి.

"అంతేనా! సంపంగులు ఘాటువాసన గలవి, నే చెప్పానుగదా! అవి తీసుకుని నీకు పడిశం వచ్చిందేమో అని విచారించాను."

"అహహా! అదేంలేదు. నిజానికి సంపెంగలంటే నాకూ చాలా ఇష్టమే. నే ఉండొచ్చిన ఆసుపత్రిలో చాలా ఉండేవి. బాధపడుతున్న సిపాయిల దగ్గిర పెడుతూండేదాన్ని." అన్నది. ఆమె సుహృదయానికీ హృదయ కోమలత్వానికీ అతనికి మిక్కిలి సంతోషం వేసింది. ముఖం

మాత్రం చదరనివ్వలేదు, "ఎంతమంది డాక్టర్లూ నర్సులూ రోగులకు పూలిస్తారు—అందులో మిలిటరీలో!" అనుకున్నాడు.

"ఎట్లాగా వెళుతున్నా వెనక్కి తిరక్కూడదు. సెలవు!" అని అట్లాగే పోయాడు. తులసి హృదయం ఆమెకే తెలీకుండా అతిథుల దగ్గరకు పోయింది.

## ద్వితీయాధ్యాయం

వేంకటలక్ష్మి జమీందారిణీ, తులసి తండ్రి బ్రతికి ఉన్నప్పుడు ఆయనను బాగా యెఱుగును. తులసి పుట్టడం, కొలది కాలంలోనే తల్లి పోవడం ఆవిడకు తెలుసు. ఆనాటినుంచి తులసిమీద కన్నకూతురల్లే అభిమానం. సెలవుల్లో ఇంటికొచ్చిందనీ మిలిటరీలో లెఫ్టెనెంటు ఉద్యోగం చేస్తున్నదనీ విని తులసికి టీ పార్టీ చేసింది. సొసైటీలో ముఖ్యులంతా వచ్చారు. రావు కూడా వచ్చాడు. రావును చూసి "మన డాక్టరు మహీపతి రాలేదేమోయి?" అని అడిగింది జమీందారిణి.

"ఏమోనండీ! తెలియదు—యవ్వనుడూ పనులున్నవాడూ—తీరిక ఉంటుందా?" అన్నాడు రావు.

"యవ్వనంలో టీ పార్టీలకు రాకపోతే మరి ముసలితనంలోనుటోయి?" అన్నది జమీందారిణి.

"అతను వచ్చినట్టయితే తులసికీ అతనికీ పరిచయం చేసేవాడ్ని. అతనూ ఐశ్వర్యవంతుడే—బుద్ధిమంతుడు కూడాను. ఈడూ జోడూ!" అన్నది రాంబాయి రావును రెండర్థాల చూపుతో చూస్తూ!

"మహీపతి బుద్ధిమంతుడేకాని ఈడూ జోడూ ఎట్లాగమ్మా! మహా ఉంటే ఒకటి రెండేళ్ళెక్కువుంటయ్యేమో! ఇంతేనా! ఇంకా నా ఉద్దేశం

మన రావే మంచివరుడు!" అని నవ్వుతూ అతన్ని చూచింది. వినిపించు కోకుండా అతనింకోవైపున తులసీ వాళ్ళూ ఉంటే అక్కడికిపోయాడు.

ముక్కు పైకెత్తుకుని ముందుకు నడిచింది రాంబాయి.

మనుష్యులను సూదిపోట్లు పొడవడంలో మహా నిపుణురాలు జమీం దారిణి. ఎప్పుడూ ఏవో పార్టీలు నిర్వహిస్తూనే ఉంటుంది. అనాథ శరణా లయాని కొకపార్టీ అంటుంది. అంధులకొక ప్రీ డ్రామా అంటుంది. ఆవిడ లేందే ఏ సోషల్ ఫంక్షన్ గూడా లేదు మద్రాసులో.

నలుగురూ కూర్చున్న చోటుకు పోయింది. "రెడ్‌క్రాస్ సొసైటీకి సహాయార్థంగా ఒక బాల్ ఏర్పాటు చేస్తున్నాను. చాలామందిని పిలుస్తు న్నాను. మిలిటరీలో ఇండియన్ ఆఫీసర్లుగూడా చాలామంది వస్తారు. రూపాయి రూపాయి టిక్కట్టు. ఆ డబ్బు రెడ్‌క్రాస్ సొసైటీకి పంపుతాం. టీకి, ఫలహారాలకూ నేనే పెట్టుకుంటాను. మరి మీరంతా తప్పకవచ్చి జయప్రదం చేయించాలి" అన్నది జమీందారిణి.

"ఓహోహో! వస్తాం వస్తాం!" అన్నారంతా మేళకంఠంతో.

"మంచి ఉద్దేశమే—పాపం ఫ్రంటుకుపోయి మళ్ళీ తిరిగి వచ్చే సిపాయిల పాట్లు తలుచుకుంటే తరాలు జ్ఞాపకం వస్తాయి!" అన్నది తులసి.

"నిజానికి ఆ డబ్బు అంతా గవర్నమెంటు సిపాయిల మీదనే ఖర్చు పెట్టుతుందంటావా?" అని అడిగింది పక్కనున్న ఒకావిడ.

"రెడ్‌క్రాస్ సొసైటీకి గవర్నమెంటుకూ సంబంధమేమున్నది?" అన్నాడు ఒకాయన.

"ఆ సొసైటీ యుద్ధసమయంలో సైనికులకు మంచి సహాయమే చేస్తుందండీ" అన్నాడు రావు.

"లేకపోతే ఆ మిల్లునీ, ఈ మిల్లునీ, ఆ సంస్థనీ, ఈ సంస్థనీ షేర్లు

పోగుజేసి మింగుతారనుకున్నారా ప్రతివాళ్లూ—కొన్నైనా మంచి సంఘాలు లేవనుకున్నారా ఈ ప్రపంచంలో!" అన్నది జమీందారిణి.

"నిజమే !" అన్నది తులసి.

అందరూ పుష్పాలు పెట్టుకుని రావాలి! మన హిందూ సాంప్రదాయం మరవగూడదు!" అన్నది జమీందారిణి.

"నేను చామంతి పూలు పెట్టుకుంటాను" అన్నది రాంబాయి.

"నువ్వో?" అని అడిగాడు తులసిని రావు.

"సంపెంగి పెట్టుకోనా మళ్ళీ?" అన్నది నవ్వుతూ.

"పెద్దవాణ్ణి, నన్ను చూస్తే ఎగతాళైతే, సంపంగి వద్దులే" అన్నాడు.

"ఏమంత పెద్దవాడూ!" అని మనసులో అనుకుంది. పైకి "ఈసారి పున్నాగపూలు పెట్టుకొస్తా! మా దొడ్లోనే ఉన్నాయి!"

"వారేవా! ఏమి వారిజినాక్షీ! పున్నాగపూలు చాలా శుభ్రమైనవి:

పురిటింటి సన్నాయికి పున్నాగపూలు.
పడుచింటి పందిలికి పారిజాతాలు !
కన్నెల నోములకు చంద్రకాంతాలు
కాంతలా కొప్పులకు సంపెంగపూలు!"

అన్నాడు రావు !

"నీ కవిత్వం గూడా ప్రదర్శింతువుగాని!" అన్నది జమీందారిణి.

"మేం సెలవు తీసుకుంటాం! మీ ఆడవాళ్ళంతా స్పెషల్‌గా మగ పురుగు లేకుండా సినీమా కెళ్లామనుకున్నారుగదూ?" అన్నాడు రావు.

"చాటుగా మాటుగావచ్చి అక్కడ కలుసుకోకు సుమా!" అన్నది రాంబాయి. మళ్ళీ ద్వంద్వార్థ మే!

"ఎంతమాట! ఎంతమాట!" అంటూ అతనూ అతని వెనక మిగతా వాళ్ళూ వెళ్ళిపోయారు.

*　　　*　　　*

వేంకటలక్ష్మీ జమీందారిణీవారి పార్టీ అని ఊళ్ళో ఉవ్విళ్లూరి పోతున్నారు. మద్రాసంతటి పట్నంలో ఆ రోజు మామూలు వాళ్ళకు పూలు దొరకలేదు.

జమీందారిణీగారి మహలు ఆవరణలో విద్యుద్దీపాలు వెలిగి పోతున్నాయి. అందమైన కుర్చీలూ, బల్లలూ ఏర్పాటైనాయి. ఓ వేపున ఓ వేదిక తయారు చేశారు. అరిటాకులతోనూ, అరిటి మొవ్వలతోనూ చిత్రంగా ఓ ఆహ్వానద్వారం నిలిపారు. ద్వారందగ్గిర నుంచుని అందర్నీ పలకరిస్తూ లోపలికి పంపిస్తున్నది జమీందారిణి.

డాక్టర్ మహీపతి వచ్చినప్పుడు "ఏమోయి డాక్టర్! ఇంత చిన్నతనంలో ఇంత తీరిక లేకపోవడమా! మొన్న పార్టీ కెందుకు రాలేదు?" అన్నది.

"క్షమించండి. మొన్న క్రికెట్ మ్యాచ్‌తో సరిపోయింది, అదిగాక మీకా రోజు ఓ స్పెషల్ గెస్టు ఉన్నదని నాకు తెలియదు."

"ఎవరో తెలుసా? రాంబాయిగారి మేనకోడలు!" అన్నది.

"అవును. లెఫ్టెనెంట్ తులసి!" అన్నాడు.

"నీ వెరుగుదువా?"

"ఎరగను గాని విన్నాను."

"పద, పరిచయం చేస్తాను! అంతా వచ్చేసినట్టేలే!"

లోపల ఓ బల్ల కిరుపైపులా కూర్చుని ఉన్నారు రాంబాయీ, తులసీ. ఒక వైపుగా కూర్చుని ఉన్నాడు రావు. అక్కడికి కెళ్ళారు వీరిద్దరూ,

నాలుగో కుర్చీమీద డాక్టరును కూర్చోపెట్టింది జమీందారిణి. "మీ యంతట మీరే పరిచయాలు" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

"ఏమోయి డాక్టర్! కంటికే కనబడడంలేదు?" అని అడిగింది రాంబాయి.

"కంటివైద్యంలో స్పెషలిస్టు మన డాక్టరు. ఆయన్నే కంటి కగ బడడంలేదంటే ఎట్టా?" అన్నాడు రావు.

"క్యాప్టెన్ రావుకు సివిలియన్లను చూస్తే యెగతాళి," అన్నాడు డాక్టరు.

"అయితే నే నవతలికి పోతాన్లే" అంటూ రావు ఇంకోవైపు పోయాడు.

"మా మేనకోడలు తులసిని ఎరగవుటోయి!" అన్నది రాంబాయి.

"ఎరక్కేం. సంక్రాంతి వస్తుందంటే నెలముందే సంబరాలు ఆరంభం!" అన్నాడు డాక్టరు.

"నీవు గూడా కవిత్వంలో పడ్డావా ఏమిటి?" అన్నది రాంబాయి.

"తప్పేమిటి పాపం!" అన్నది తులసి.

"తప్పులేదు గాని నేను కవిత్వంలో పడలేదు. పెయింటింగ్‌లో పడ్డాను. అదైనా అవకాశం ఉన్నప్పుడు" అన్నాడు డాక్టరు.

"అందుకనేనా చిత్రించినట్లు మాట్లాడావు!" అన్నది రాంబాయి.

"చిత్రపటం చూశాను గనకేమో చిత్రించినట్లు మాటలు రావడం!" అన్నాడు డాక్టరు.

"ఏం చిత్రపటమోయి?"

"మీ లెఫ్టెనెంటు తులసి ఫోటో!"

"నీ కెక్కడిదీ?"

"మా చెల్లెలు పంపింది—ఆవిడ కూడా మిలిటరీలో ఉంది కదా !"

"ఓహో! చెప్పలేదేమే తులసీ !"

"ఆ సందర్భం రాలేదు. ఆ మాట రాలేదు. అయితే మేం యిద్దరం చాలా చిక్కని స్నేహంతో ఉండేవాళ్ళం. వచ్చేప్పుడు విచారించింది కూడా!" అంది తులసి.

"మిమ్మల్ని గూర్చి చాలాసార్లు వ్రాసింది కూడాను."

"మీ ఇద్దరూ గూడా అంత స్నేహంతో ఉండే ఎంతో సంతోషం." అన్నది రాంబాయి.

అంత సూటిగా అన్నమాటకు డాక్టరుకు సిగ్గొచ్చింది. తులసికి మాత్రం వికారమేమీ వేయలేదు.

"నీ వంటి ఒక్క అన్నయ్య ఉన్నా బాగుండేది నాకు. తలిదండ్రుల కొక్కతెనే పుట్టాను. వాళ్ళు గూడా పోయారు. పాపం మా మేనత్తమీద పడ్డది భారం అంతా!" అన్నది తులసి.

"మీ మేనత్త సామాన్యురాలా! గవర్నరు సెక్రెటరీకన్న నిపుణురాలు!" అన్నాడు డాక్టరు. "అన్నయ్య" అన్నచోట ముఖం చిట్లించాడు. రాంబాయి గూడా ముఖం చిట్లించింది.

"జమీందారిణికి కాసేపు తోడుగా ఉండి వస్తా!" అని రాంబాయి పోయింది. పోతూ "వీళ్ళిద్దరికీ మనస్సులు జతపడితే బాగుండును. మంచి సంబంధం. రావు నాకు మిగులుతాడు. ఎన్నాళ్ళూరుకుంటాడేం!" అనుకుంది.

"ఏ బాయ్! ఐస్‌క్రీం కేకులూ పట్రా!" అన్నాడు డాక్టరు. "క్రీంతో కేకు కలుపుకుని తింటే మహారుచి" అన్నాడు.

"మీరు డాక్టర్లు గదా ! ఎప్పుడూ ఐస్క్రీం తినడం మంచిదేనా!" అన్నది తులసి.

"సలహా ఇచ్చేంత వరకే డాక్టర్ను. అనుభవించకుండానా!"

"యుద్ధంలోకి పోయిన సిపాయిలు ఏం అనుభవిస్తున్నారు చూడండి!"

"మన యుద్ధమా, మన వ్యవహారమా! ఎందు కింతమంది మిలిటరీకి పోవడం? ఆ మాత్రం త్యాగం నాకు లేకనేపోలేదనా?"

"వెళ్ళిన వాళ్ళకు బుద్ధి లేదనుకుంటారా! ఒక ఊళ్ళో ఓ ఇల్లు తగ లడుతుంటే మా ఇల్లు కాదు మా ఇల్లు కాదని ఊళ్ళో వాళ్ళూరుకుంటే ఊరుంటుందా?"

"ఇది ఒక ఊరి వ్యవహారమా?"

"ప్రపంచ వ్యవహారం. అయితే ఇది ప్రపంచ యుద్ధం కాదూ! మన కిష్టమైనా కష్టమైనా మనం అందులో లేమూ! ఉన్నప్పుడు ఉన్నవాళ్ళకు సాయం చేయొద్దూ!"

"అంతా మిలిటరీలోకి పోతే మిగతా ప్రజకో ! నేను బైట ఉండి సాయం చేస్తున్నాను!"

"గుండెమీద చేయి వేసుకుని ఆ మాట నిజమైతే అదీ మంచిదే !" అన్నది తులసి. డాక్టరు ముఖం చిట్లించాడు.

"ఎంటర్టేన్‌మెంటుంది రండోయి!" అంటూ రాంబాయి వచ్చింది.

అంతా వేదికచుట్టూ చేరారు. బ్యాండు వాయించారు. డాక్టరు ఓ సినీమా పాట పాడాడు. ఒక దొరసాని ఒక పాట పాడింది. తులసి చక్కని కంఠధ్వనితో "సా విరహే" అని కన్నడలో పాడింది. రావు వేదిక ఎక్కి నవ్వుతూ "ఆర్యులారా! ద్రావిడులారా! ప్రాచ్యులారా! అప్రాచ్యులారా!

వినండి. నాకు సంగీతంరాదు. నన్ను బలవంతంగా వేదిక నెక్కించారు. సరే; అయితే బలవంతంగా యీ కవిత వినండి!

నీ మీది విరహాన
 నిదురలేదే నాకు
నినుజూచి సాగింది
 అంగిట ఇంగితము!
  నీ ముందట సంగీతము!

నీవు పోయే దారి రాధారిపై
 వెన్నాడి రాధా యవను అనను!
నీ మీది నాప్రేమ చులకనిదిగాదు
 చంగటను ముంగిటను మాటాడుకుంటాను!
అంటరానివాడనై రాలేదు నీవెంట,
 నిండుగుండె లేకనే వెంబడించనని
అనుకోకు సుంతైన అనుమాన పడవోకు
 అంటించుకోగలను నిండుకుని పొర్ల గలను!
నీమీది ప్రేమచే హితుల కవహితునైతి
 నిను తలంచి తలిచి ఆత్మధ్యానినైనాను!
పరమాత్మధ్యానినైనాను!"

"శెబాస్ శెబాస్" అని అంతా చప్పట్లు కొడుతుంటే చేయి యెత్తి ఆపి "మిత్రులారా వచ్చేవారం మళ్ళీ ఇక్కడే పార్టీచేస్తా నీవిధంగానే" అన్నది జమీందారిణిగారు. ఈసారి ఇండియన్ సిపాయీల సౌకర్యార్థం వినియోగం అవుతుంది వచ్చిన ధనం. ఇవ్వాళ వలెనే అంతా సానుభూతి చూపిస్తారని జమీందారిణీ వారి కోరిక."

పార్టీ ముగింపయింది.

# తృతీయాధ్యాయం

కాఫీ హోటలులో మిలటరీనుంచి ఇంటికి సెలవుల్లో వచ్చి ఓ వారం మద్రాసులో ఉండి చూద్దామని వచ్చిన లచ్చన్నగాడు ఓ బల్లముందర కుర్చీలో కూచున్నాడు. వేరేస్థలం లేక ఆ బల్ల ముందర కుర్చీల మీదే కూచున్నారు లాయరు అనంతాచారీ, బి. ఏ, స్టూడెంటు కుమారస్వామి. కోర్టుకు పోబోతున్నాడు అనంతాచారి. కాలేజీకి పోబోతున్నాడు కుమార స్వామి.

"నిన్న యీ లాయరుడ్రెస్సూ ఏమీ లేకుండా దర్జాగా పోతున్నారు. సాయంత్రం విశేషాలేమిటండీ అనంతాచార్లుగారూ?" అన్నాడు కుమార స్వామి.

"విశేషాలేమున్నయ్యోయి! వెంకటలక్ష్మీ జమీందారిణి గారంటే విన్నావుగా. ఆవిడ టీపార్టీకి పిలిస్తే పోయాను."

"అయితే సొసైటీ గాసిప్ రెండు జేబుల్నిండా ఉందన్నమాటే!"

"గాసిప్‌కేంగాని మనకెందుకులే!"

"ఏమిటండోయ్! ఏదో ఉందే!"

"ఉందేమిటోయి ! అసలు ఆడవాళ్ళను సభల్లోకీ పార్టీలలోకీ రానివ్వడమే తప్పైనా ముచ్చటగా ఉంటుందంటే నేనూ ఒప్పుకుంటాను. అయితే ఆడాళ్లూ మొగాళ్లూ కలిసి ఓపెన్‌గా లవ్ చేసుకోడం పశ్చిమంలో చెల్లిందేమోగాని మనదేశాచారానికి విరుద్ధం!"

"లేటెస్టు లవర్సు ఎవరండీ?"

"ఎవరున్నారూ, రాంబాయీ ఆవిడ మేనకోడలు తులసీ వచ్చారు. క్యాప్టెన్ రావూ, డాక్టరు మహీపతీ వచ్చారు. క్యాప్టెనూ డాక్టరూ తులసితో

లవ్ సాగించారు. క్యాప్టెన్ మాత్రం పై కేమీ చూపలేదు. ఇతరులకూ తెలీదనే అనుకుంటూ. అయితే నేను చూడంగానే సూదంటు రాయిల్లే సత్యం గ్రహిస్తా."

"నేత్రాంజనం ఉందిలెండి మీకు!"

"డాక్టరు మాత్రం సిగ్గూ బిడియమూ లేకుండా మొదలెట్టాడు. రాంబాయి అతన్ని ప్రోత్సాహిస్తోంది. ఎట్టాగయినా క్యాప్టెన్ను తనవలలో వేసుకుందామని—దాని శ్రాద్ధం రెండోపెళ్ళిట!"

"తులసి ఎటువంటిదండీ?"

"లెఫ్టెనెంటు! చాలా అందమైంది. ఐశ్వర్యం గలది. నాకు చూస్తే యీ లవ్వూ గివ్వూ తెలిసిన పిల్లల్లే కనబడలేదు. అయినా ఏ పుట్టలో ఏ పాముందో!"

"ఏ పొదలో ఏ పువ్వుందో అనిగూడా ఉంది కాదండీ" అన్నాడు ఊరుకోక లచ్చిగాడు.

"నువ్వెవ్వరివోయి?" అని అడిగాడు ఆచారి.

"నేనాండి? నా పేరు నాయక్ లచ్చన్న! మా కంపెనీ యేరే ఉంది లెండి. ఓసారి లెఫ్టెనెంట్ తులసిగారి ఆసుపత్రికి రెండులారీలు డిటాచ్ మెంటు డూటీలో పట్టుకెళ్ళాం. నెలరోజు లున్నాను. ఆ మనిషివంటి మనిషి ఉందిటండీ?" అన్నాడు లచ్చన్న.

"మిలిటరీలో మంచేళిటి చెడేమిటోయి?"

"మిలిటరీ అంటే ఏం, తీసేసిందనుకుంటూరాండీ? తులసిగార్ని సూస్తే క్యాప్టెన్లూ మేజర్లూకూడా హడలిపోయేవోరు. అసలావిడకు యావ లేదండీ! రోగులకు మాత్రం దేవతల్లే ఉండేది!"

"అట్టా అను! అన్ డెవలప్డ్ !" అన్నాడు కుమారస్వామి.

"అంజేనండీః" అని అడిగాడు లచ్చన్న.

"నీకు తెలీదులే! తిట్టాననుకోకు!"

"మీరుగాదు మీ బాబులు తిట్టలేరండీ ఆవిడ్ని" అన్నాడు లచ్చన్న.

"మాటలు మిగలనీయవాకు — మీ మిలటరీ గాదు!" అన్నాడు కుమారస్వామి.

"పబ్లికుగా ఆడాళ్ళను ఏకుతూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడమనేనా నీకు సెప్పిన సదువుః మా మిలటరీలో అట్టా సెప్పరులే!"

"ఎన్నసార్, ఇంగె ఎన్నమో గలాటా ఇరికి!" అని కేకేశాడు బల్లలు తుడిచేవాడు.

"ఇదిగో ఎందుకొచ్చిందోయి! మనదారి మనం పోదాం పద!" అన్నాడు ఆచారి. ఇద్దరూ పోతూంటే వెనక్కు వెనక్కు చూచాడు కుమారస్వామి.

"సిట్టగాంగులో అట్టాగే సూత్తూ పోయేవోళ్ళు జపాన్‌గాళ్ళు!" అనుకున్నాడు లచ్చన్న.

## చతుర్థాధ్యాయం

తులసిమీద మహామోహంతో రోగులనుగూడా సరిగా చూడకుండా తిరుగుతున్నాడు డాక్టరు మహీపతి. రాంబాయి ఆశీర్వచనం అతనిమీద ఉంది. వీలైనప్పుడల్లా టీ కనో దానికనో దీనికనో రాంబాయి ఇంటికి తయారవుతూండే వాడు.

"తులసిమీద మంచి మక్కువతో ఉన్నాడు. ఈడూ జోడూ! నేను గట్టిగా పట్టుపట్టితే తులసిమాత్రం ఒప్పుకోదూ!" అనుకుంది రాంబాయి.

జిల్లాజడ్జీ కూతురుకు గూడా పట్టుదల ఉంటుందని తెలుసుకోలేదు.

మన్మథుడి వలలో మహీపతి చిక్కుకున్నాడు— మహావ్యథ పడుతున్నాడు. అదే వలలో తులసిగూడా చిక్కుకోలేదు. ఏ ప్రియుడు ప్రేమకు ప్రేమ ప్రతిఫలించ దనుకుంటాడు? మనసులో ప్రేమ వున్నంత కాలం ఆశ ఉంటుంది, ఆశ ఉన్నంత కాలం ప్రయత్నం ఉంటుంది. ప్రేమ ప్రయత్నంలో ఉన్నవాడికి పరప్రశ్నలపై పరాకుంటుంది. ఎక్కడి కెళ్ళినా వాడి నడకలో వాడి భావం తెలుస్తుంది. ఎవర్ని చూసినా వాడి దృష్టిలో వాడి చింతన వ్యక్తమౌతుంది. ఏం మాట్లాడినా వాడి మాటల్లో వాడి రంధి స్పష్టమౌతుంది.

ఈ స్థితిలో ఉన్నాడు డాక్టరు మహీపతి. క్యాప్టెన్ రావో!

"వాళ్ళిద్దరూ సమవయస్కులు. రాంబాయికి గూడా ఆ సంబంధం ఇష్టంగా ఉంది. మధ్య నేనెందుకూ? అసలు వివాహం వద్దనుకున్న వాడికి నా కెందుకీ వికారం? ముప్పైఏైదు దాటాయి. మిలిటరీనుంచి తిరిగొస్తే యేదో గ్రంథావలోకనం చేసుకుంటూ అనుభవాలు రాసుకుంటూ ఉంటే కాలం హాయిగా గడుస్తుంది." అని అనుకున్నాడు రావు. అనుకున్ననాడే అన్నగారి దగ్గిరకు పోయాడు, మద్రాసు వదలిపెట్టి.

రావు మద్రాసు వదిలిపెట్టినట్టు ఎవరికీ తెలీలేదు. తెలిసినప్పుడు కారణం అంతకుముందే తెలీలేదు.

డాక్టరు మాత్రం తన ప్రేమకు పూలూ కాయలూ విదుల్చుతున్నాడు. తులసితో మాటాడినప్పుడల్లా అతని ధోరణి అడివల్లే వెల్లడౌతూనే వుంది. అయితే అందులో సౌకుమార్యంలేదు. రావు మాటల్లో పొందిక ఉంటే ఇతని మాటల్లో తొందరుంది. రావు కంఠంలో మార్దవం ఉంటే ఇతని కంఠంలో ఆత్రత్వముంది. రావు చూపుల్లో సత ఉంటే ఇతని చూపుల్లో సెగలున్నాయి। ఇంతెందుకూ! పేరూ ఊరూ లేదు ఆ ప్రేమ గుణానికి,

ఆ లాలిత్యానికి. అది అనుభవం పండి జీవితంలో ఓ పట్టుకు వచ్చిన రావు దగ్గిర ఉంది. ఇంకా లేతతనంలో ఉన్న డాక్టరు దగ్గిరలేదు. అదిగాక తులసి సెలవుల్లో యింటికి రాంగానే మొదట కలిసిన మోహపరిచయుడు రావు. తులసికి తెలీకుండానే తులసి హృదయంలో ముద్రితమైనవాడు రావు.

తర్వాత మోహపడినవాడు డాక్టరు. రావువల్ల తన కాటకం కలుగుతుందని డాక్టరు ఎప్పుడూ అనుకోలేదు. తన ధ్యాసే తనది.

రాంబాయి డాక్టరును మాత్రమే ఓ రోజు ఒంటరిగా టీ కని పిలిచింది. డాక్టరు వచ్చేదాకా టీ పదార్థాలు బల్లమీద పెట్టలేదు. డాక్టరు వచ్చిం తర్వాత "టీ తయారు చేస్తాను. మీరు మాట్టాడుతూ ఉండండి" అని లోపలికి పోయింది.

సావిటి హాలులో డాక్టరూ, తులసీ కూర్చున్నారు.

"మా అత్తయ్యకు పూలు ఏరటంలో అంత అభిరుచి లేదనుకుంటాను. ఎప్పుడూ మల్లెలూ చేమంతులూ, మల్లెలూ చేమంతులూ!" అన్నది తులసి.

"మీకే పుష్పాలంటే ఇష్టం?" అన్నాడు డాక్టరు.

"సంపెంగలు లేవా! రంగువల్లులు లేవా! మా దొడ్లో పున్నాగలు లేవా! ఆవిడపిచ్చే ఆవిడకు. కాగితపు పుష్పాలూ, మధ్య మధ్య మల్లెలూ, చేమంతులూ! ఇంతకన్న ఇంకోటి కనపడ దిక్కడ! చూడండి ఏ పూల గ్లాసులోనైనా !"

"నాకు తెలీదు! లేకపోతే మీ కిష్టమైన పూలు తెచ్చేవాణ్నే!"

"మీ సంగతి కాదండీ, మా అత్తయ్య మాటన్నాను!"

"చూడు తులసీ!" అన్నాడు డాక్టరు. తులసీ అని సంబోధించింది అదే ప్రథమం—ఎంతో ధైర్యం తెచ్చుకున్న తర్వాత.

"ఊ!" అన్నది తులసి.

"నీతో ఓ సంగతి చెబుదాం అనుకున్నా!"

"ఏమిటా సంగతి" అంది తులసి.

"అబ్బ! గ్రహించలేవా తులసీ !"

"గ్రహించడాని కేముందోయి? చెప్పరాదూ!"

"నిన్ను మిక్కిలి ప్రేమిస్తున్నానని ఎట్లా చెప్పమంటావు తులసీ!"

తులసికి ముఖం ఎర్రబడ్డది. ప్రేమ ప్రతిఫలంగా గాదు, ఆశ్చర్యం తోనూ అమాయకంతోనూ!

తులసి రెండు చేతులా చేతుల్లోకి తీసుకుని అన్నాడు డాక్టరు. "నిన్ను నే ప్రేమిస్తున్నట్లింకెవరూ ప్రేమించడంలేదు తులసీ! నన్ను పెండ్లి చేసుకో!" అన్నాడు డాక్టరు.

"ఉహూ! నిన్ను పెండ్లాడుదామనే ఉద్దేశం నాకు లేనేలేదు, డాక్టర్. పైగా శారద అన్నవుగదా! నాకు అన్నలేదు నీవే అన్నవల్లే ఉంటావను కున్నానుగాని, నాకు పెండ్లి ప్లాను ఇంతవరకూ మనస్సుకు రానేలేదు."

"బహుశా ఇవ్వాళ నీవు కులాసాగాలేవేమో? రేపొచ్చి మాట్లాడు తాను. నాకు గూడా ఒంట్లో వికారంగా ఉంది. రాంబాయిగారితో నేను వెళ్ళి పోయినానని చెప్పండి." అని డాక్టరు అదే పళంగా వెళ్ళిపోయాడు.

ఇంతలో లోనుంచి వచ్చింది రాంబాయి.

"డాక్టరేడి తులసీ ?" అన్నది.

"డాక్టరు ఒంట్లో వికారంగా ఉందని వెళ్ళిపోయాడు అత్తయ్యా!"

రాంబాయి ఏం మాట్లాడలేదు. గ్రహించింది. మాట్లాడే సమయం ఉందిలే అనుకుంది.

"ఆ పిల్ల ఎంత చదువుకున్నా అభం శుభం తెలిసిన పిల్లగా లేదు. యవ్వనంలో ఉన్నాను. నెలకు వెయ్యి రూపాయిలు సంపాయిస్తున్నాను. నాకన్న మంచి సంబంధం ఉందా! కొంచెం ఓపిక పడితే మంచిది" అనుకుంటున్నాడు డాక్టరు.

"రేపొస్తాడనుకుంటాను, విషయం అటో ఇటో తేలుస్తాను, అటో ఇటో ఏమిటి? నేను చెప్పినట్లు తులసి చెయ్యాల్సిందే." అనుకుంది రాంబాయి.

అనుకుంటూ మర్నాడు డాక్టరు రాగానే "ఏం డాక్టరు! నిన్న చెప్ప కుండానే వెళ్ళిపోయావు?" అంది.

"నిన్న ఒంట్లో ఏదో వికారం వేసింది రాంబాయిగారూ! అదికాక మనస్సులో గూడా బాధపడ్డాను!"

"మనస్సులో బాధేమిటోయి!"

"మీకు తెలీందేముందండీ? తులసిని పెండ్లాడుదామని కనబడ్డరోజు నుంచీ అనుకుంటున్నాను. నిన్న ఆ మాట అన్నాను. ఆవిడ కిష్టంలేదు."

"ఆవిడ ఇష్టం ఏమిటోయి! నీకన్న మంచివరుడు దొరుకుతాడా?"

"మీ దయ!"

"నీ కెందుకు— నే చెబుతానుగా!"

"సరేలెండి! మళ్ళీ రేపొస్తాను !" అని డాక్టరు వెళ్ళిపోయాడు.

డాక్టరు వెళ్ళగానే తులసిని పిలిచింది రాంబాయి. రాగానే "నిన్న జరిగిన సంగతి నాతో చెప్పలేదేం తులసీ?" అన్నది.

"నిన్న ఏం జరిగింది అత్తయ్యా!"

"డాక్టరు నిన్ను పెండ్లి చేసుకోమన్నాట్ట, నువ్వు వద్దన్నావుట!"

"చేసుకుంటానంటే నీతో చెప్పేదాన్నిగాని వద్దన్నప్పుడెందు కత్తయ్యా! అతన్ని చూస్తే జాలివేసింది!"

"జాలివేసిందీ! నెలకు వెయ్యి రూపాయిలు సంపాయిస్తున్నవాడ్ని చూస్తే నీకు జాలివేస్తుందే! ఏం బడాయే!"

"బడాయిగా దత్తయ్యా, నిజం అంతే!"

"నిజమేమిటి? నువ్వప్పుడే స్వతంత్రురాలవైనావనుకున్నావా! ఇంకా సంవత్సరందాకా నా మేనేజ్‌మెంటులో ఉన్నావు జాగ్రత్త! ఈ లోపల నీ ఈడు వాళ్ళంతా పెళ్ళిచేసుకుని సుఖంగా ఉంటారు. నువ్వు నాపసానివై నిలబడాలి. నాకు తెలుసులే, రావును పెండ్లి చేసుకుందాం అని ఉన్నట్టుంది. రావు అరితేరినవాడు, నీకన్న పదిహేడేండ్లు పెద్ద. నీబోటి వాండ్లను ఎంత మందిని చూచాడో? చూచావా, నీ మీద మక్కువున్నవాడైతే మద్రాసు విడిచిపోతాడా? అదే నీకు గుర్తు. బుద్ధిమాద్యం కలిగించుకోక, డాక్టరును పెండ్లాడు. మంచిది, ఆలోచించుకో." అంటూ మళ్ళీ లోపలికి పోయింది.

అట్టాగే కాసేపు నిల్చుని "నాకిష్టంలేనివాడ్ని నేను పెండ్లి చేసుకోనే చేసుకోను. ముమ్మాటికీ నిజం!" అనుకుంది తులసి.

అట్టా అనుకుంటూ మేనత్త దగ్గిరనుంచి ఎక్కడికయినా వెళదామనుకుంది. వెంటనే మెరుపు మెరిసినట్లుగా కాంతాబాయి అడ్రసు జ్ఞాపకం వచ్చింది.

ఓ టాక్సీ చేసుకుని ఓ సూటుకేస్ తీసుకుని కాంతాబాయి ఇంటికి పోయింది తులసి.

వరండాలో కాంతాబాయి పుస్తకం చదువుకుంటూ కూర్చుంది అయిదు

న్నరకు. అప్పుడే స్కూలు వదిలిపెట్టారు. తులసి రావడం చూసి తలెత్తి "ఓహో తులసీ! ఇంకా ఎన్నాళ్ళున్నాయి నీ సెలవులూ?" అని అడిగింది.

"ఇంకా తొమ్మిదిరోజు లుంటాయండీ! మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను."

"ఓ రెండు రోజులుంటావా?"

"రెండురోజు లేమిటండీ! సెలవులయ్యేదాకా ఉండి ఉద్యోగానికి వెళ్తానండీ!"

"అదేమిటి తులసీ?"

తులసి జరిగిన సంగతంతా తెలిపింది.

విన్నది కాంతాబాయి.

"ఇక్కడ రెండురోజులుండు తులసీ! అంతకన్న ఎక్కువ ఉండడానికి వీలులేదు. అయితే నీ ఇష్టం కానిపని నీవు చేయవద్దు. నీ యిష్టంలేని వరుణ్ణి నీవు పెండ్లాడవద్దు. నీవు చిన్నపిల్లవు గావు. ఓర్పుతో ఉండు. మీ మేనత్త దగ్గరకే వెళ్ళు. ఆవిడ ఏం చేయగలదు నిన్ను? ఏమీ చేయ లేదు. నూటిలో ఒకతెవు నీవు. నీ వంటివారు సకృతు తులసీ! అయితే ప్రపంచానికి ఝడిసి పోగూడదు. ఎదుర్కోవాలి. నా మాటలు మళ్ళీ ఆలోచించుకో" అన్నది కాంతాబాయి.

ఆ రాత్రి అక్కడే పడుకుని మర్నాడు మళ్ళీ మేనత్త ఇంటికి వెళ్ళింది.

మేనత్త గ్రహించింది. ఎక్కడి కెళ్ళావు అని ప్రశ్నించ లేదు. మామూలుగా ఉన్నట్టే ఊరుకుంది.

* * *

అంతటితో డాక్టర్ మహీపతి వదిలిపోయాడా? వదిలిపోగలడా?

మామూలుగా ఏ బజారులోనో కనబడి ఇంటికి పోతున్న యువతిని వెన్నాడే యువకుడు, ఆ యువతి ఇంటికి పోయి తలుపులూ కిటికీలూ వేసుకున్న తర్వాత గూడా తారట్లాడకుండా పోడే! అలాంటిది నవనవలాడుతూ విద్య కలిగి ఐశ్వర్యం కలిగి అందం కలిగి పరిచయం ఉండి పెండ్లాడుదామనే సదుద్దేశం ఉన్నవాడు అంతటితో వదిలి పోగలడా!

రాంబాయి బలవంతంమీద మనస్సులో ఇష్టంలేకపోయినా డాక్టరుతో ఆంధ్ర మహాసభ ఆర్టు ప్రదర్శనం చూడడానికి వెళ్ళింది తులసి.

హాలులోకి వెళ్ళగానే దుర్గాబాయమ్మగారు వాళ్ళను చూచి "ఇంత తులసి కాస్తా ఎంతైందండీ రాంబాయిగారూ! ఓహో లెఫ్టెనెంటా! ఈ మిలిటరీ క్రేజు మీకూ కలిగిందీ! సరే సరే! సాయంత్రం సభకొస్తారా?"

"సాయంత్రం వెంకటలక్ష్మి జమీందారిణీ వారింట్లో పార్టీకి వస్తామని వాగ్దానం చేశామండీ!"

"మీరూ మీ పార్టీలూ! ఎప్పుడూ ఇంతే!" అని లోపలకు పోయింది ఒక ఆర్టిస్టుతో కలిసి.

"అవిగో రామారావు బొమ్మలు! కూల్డ్రే అంతటివాడు మెచ్చుకున్నాడు. చూద్దురుగాని రండి!" అని ఓ మూలకు తీసుకుపోయాడు డాక్టరు వాళ్ళిద్దరినీ. అక్కడ అదివరకే నుంచుని చూస్తున్న మనిషి వెనక్కు తిరిగి "ఓహో!" అన్నాడు.

"అదేమిటోయి రావూ! ఎవరికీ చెప్పకుండా ఎక్కడికి పోయావూ? నాలుగు రోజులునుంచీ నలుసైనావే?" అన్నాడు డాక్టరు.

"మా అన్నగారు కబురుచేస్తేవెళ్ళానోయి. ఆయనకు వ్రణం లేచింది. మళ్ళీ స్పెషలిస్టు దగ్గిరకని యీ ఊరే తీసుకుని వచ్చాను. ఏమీ తోచక ఈ ప్రదర్శనానికి వచ్చాను. రాంబాయిగారూ, లెఫ్టెనెంటుగారూ కులాసాయేనా?"

"కులాసాకేంగానీ సాయంత్రం జమీందారిణీ వారింటికి వస్తావా?"

"ఊళ్లో ఉండి రాకపోతే ఆవిడ ఊరుకుంటుందా?" అంటూ తులసివేపు తిరిగి "ఆర్టు అంటే మంచి అభిమానం ఉన్నట్టుంది మీకుగూడా?" అన్నాడు రావు.

"ఆర్టును చూచి ఆనందించగలను. కాని కవిత్వం విని తన్మయం పడగలను!"

"ఓహో! అయితే మీలోనూ కవిత్వం ఉంది!"

"వ్యక్తీకరించడానికి తగిన అనుభవం లేదు!"

"కవిత్వాన్ని వినిగాని చదివిగాని సరిగా గ్రహించడంగూడా ఒక విధమైన వ్యక్తీకరణమే!"

"నేను చదివిందికూడా చాలా తక్కువేలెండి!"

"అసలు చదువుకోకుండా కవిత్వాన్ని ఎక్కిరించేవాళ్ళు లేరూ! విద్య వేయి విధాలుగా రావచ్చు—జ్ఞానం రావాలంటే సంస్కారం పరిపక్వమవాలి. జ్ఞానం ఎంతవుంటే అంత సహృదయం ఉంటుంది. సహృదయులకే సత్యగ్రహణమూ సదభిప్రాయాలూ ఉంటాయి. మూకాభిప్రాయాలు మందికోసం. మంది బుద్ధికి స్థిరత్వం లేదు. చంచలానికి అంజలి చేసేకన్న ముంజలమ్ముకోవడం మంచిది."

"అంత ఏకాగ్రబుద్ధితో, ఏకోపాసనతో ఉన్నవాళ్ళు ఈ రోజుల్లో లేరేమో?"

"అసలు లేకపోలేదు. మనదృష్టి స్వల్పమైతే మనకు కనబడేవీ స్వల్పమే!" అని ఎవరూ చూడకుండా ఓ నిట్టూర్పు విడిచాడు రావు.

"మిలిటరీ ఆసుపత్రిలో ఉద్యోగం అయింతర్వాత ఆ సిపాయిలూ, వారి బాధా, వారి కష్టాలూ చూసిచూసి నాకు అదే ఒక విద్యాశాలగా అను

భవం కలిగింది. ఆ అనుభవానికీ, మీరనే అనుభవానికీ తేడా ఏమయినా ఉందా?"

"అదృష్టవంతురాలవు! ఎంతమంది మిలిటరీ ఆసుపత్రిని ఒక విద్యా శాల అనగలరు? క్లోజ్‌డ్‌క్వార్టర్సులో మానవానుభవం, మానవకష్టం, మానవ చిద్విలాసం, చపలత్వం, ఛాందసం ఇవన్నీ చూచావు. గ్రహించే వారికి అంతకన్న అవకాశం ఏముంది?"

"మీ మాటలవల్ల నా గుండె కెంతో నిబ్బరం కల్గుతున్నది రావు గారూ!"

ఎవరూ చూడకుండా మళ్ళీ నిట్టూర్పు విడిచాడు రావు.

"నేను వెళ్ళివస్తానండీ రాంబాయిగారూ. యువకులు విలాసంగా తిరుగు తున్నప్పుడు నాబోటి ముదురుబారువాళ్ళు అడ్డురాకూడదు" అని డాక్టరు వీపుమీద ఎగతాళిగా తట్టి వెళ్ళిపోయాడు.

ఎదుట ఉన్న బొమ్మను అదే ధ్యానంతో చూస్తున్నది తులసి. బొమ్మమీద ధ్యానమో యదాలాపమో.

కొంచెం కొంచెం అవతలికిజరిగారు, జరిగీ జరగనట్టుగా రాంబాయీ, డాక్టరూనూ.

"రావు నీకు చాలాకాలం నుంచీ స్నేహితుడే కాదోయి" అన్నది మెల్లిగా రాంబాయి.

"అవునండీ!" అని విరహవేదనతో ఓ నిట్టూర్పు విడిచాడు డాక్టరు.

"ఉట్టి నిట్టూర్పులతో ప్రయోజనం ఉంటుందిటోయి? రావుమీద మహాగౌరవం కుదిరింది తులసికి. అతని అభిప్రాయం అన్నా, సలహా అన్నా ఎంత ఆమోదిస్తున్నదో చూచావు గదా? రావుతోనే చెప్పు నీకి సంబంధం ఖాయం చెయ్యమని."

"తులసి మాత్రం చిన్నపిల్లటండీ? తనకులేంది ఒకళ్ళు కలిపిస్తే కలి గించు కుంటుందా?"

"పిచ్చిగా మాట్లాడకోయి. ఆడదానికి ఒకప్పుడున్న మనసు, ఒకప్పుడుంటుందా? చెప్పేవాళ్ళు చెప్పేరీతిగా చెబితే ఒప్పుకోదంటావా, సాయంత్రం పార్టీకి వస్తావుగా, రావుతో మాట్లాడిచూడు"

అట్టాగే చేద్దామనుకున్నాడు మనస్సులో రావు. ప్రేమపిచ్చిలో పడ్డ వాడికి పరేంగితం ఉండదు.

నిద్రలోంచి లేచినదాని మాదిరిగా కళ్ళు పైకెత్తి "పోదామా అత్తయ్యా!" అన్నది తులసి.

## పంచమాధ్యాయం

ఆ రోజు సాయంత్రం జమీందారిణీవారి ఇంటి ఆవరణలో పెద్ద పార్టీ. విద్యుద్దీపాలు వేలకువేలున్నాయా అన్నట్టు ప్రకాశిస్తున్నాయి. గోడల మీద ఎక్‌స్టెంషన్ వైర్లు పూలతీగలల్లే అతుక్కుపోయి ఉన్నాయి.

కుర్చీలమీద కూర్చున్న అతిథులు ఎన్నెన్ని రకాల దుస్తులో వేసుకుని ఉన్నారు. స్త్రీల జల్తారంచు చీరెలు స్వర్ణకాంతులను చిమ్ముతున్నాయి. దుద్దులలోని రాళ్లూ, ఉంగరాలలోని రవ్వలూ విసురుతుండేతళుకులు ఇదేదో పాండవ కౌరవుల జూదసభా అనిపిస్తున్నాయి.

ఫలహారాలు, టీ, సోడాలు ఎన్నెన్నో బల్లమీద ఖర్చైపోతున్నాయి. ఓ మూల సన్నని బ్యాండ్, ఓ మూల రేడియో!

ఓ బల్లచుట్టూ కూర్చున్నారు, రావూ, డాక్టరూ, రాంబాయి. తులసి లేదు.

ఆదుర్దాతో అడిగాడు డాక్టరు "లెఫ్టెనెంటు రాలేదాండీ రాంబాయి గారూ!" అని.

"వచ్చిందోయి! జమీందారిణీ దగ్గిర ఏవో పుస్తకాలున్నెయ్యంటే మేడమీదికి పోయింది ఆవిడతో కలిసి!"

"జమీందారిణిగారితే వస్తూన్నారే ఒంటరిగా!"

"ఏదీ! ఆ, ఏమండీ! తులసి కిందికి రాలేదే !"

"తలనొప్పిగా ఉందట—కాసేపక్కడే నా మంచంమీద పడుకుని రమ్మన్నాను. పాపం, ఏమో మొఖం ఒక మాదిరిగా ఉంది." అన్నది జమీందారిణి—అంటూ వేరే అతిథుల దగ్గరకు పోయింది.

ఒక లావాటాయన "అదేమిటండీ లోనుంచీ పైనుంచీ పొగ లొస్తొన్నాయి? సిపాయిల సహాయార్థం పార్టీ అని, తూటాలు గూడా పేలుస్తున్నారా?" అన్నాడు సగం ఎగతాళిగా సగం గాభరాతో.

"ఎక్కడైనా షార్టుసర్క్యూట్ అయి తగులపడటంలేదుగదా!" అని లేచాడు రావు.

జరిగింది అదే. కొన్ని వైర్లకు షార్టుసర్క్యూటు అయి ఒక జ్వాల పైకి లేచింది. పక్కనేవున్న పరదాగుడ్డ లంటుకున్నాయి. ఆ పక్కనే రెండు పెట్రోలు డబ్బాలుంటే అవంటుకుని కిటికీ లంటుకున్నాయి. నిప్పులూ పొగలూ ఎక్కువౌతున్నాయి. మేడమీదికి పాకుతున్నాయి.

వెంటనే లేచాడు రావు. పరుగు పరుగున పోయాడు. రెండేసి మూడేసి మెట్లు దాటుకుంటూ మేడమీదికి పోయాడు.

క్రింద కోలాహలం !

మేడమీద నాలుగు గదులు దాటాడు రావు. అయినో గదిలో పందిరి మంచంమీద నిద్రపోతున్నది తులసి. ఓ నిముషం అట్టే చూచాడు.

క్రింద గంద్రగోళం !

"బాంబుల మధ్యైనా చలించకుండా ఉండే పిల్లంటే యీ పిల్లే!" అనుకున్నాడు రావు మాట్లాడకుండా, తన వొళ్ళు తాను మరిచిపోయి ఆ కోమలి బుగ్గమీద స్పర్శమాత్రంగా ముద్దెట్టుకున్నాడు. అప్పుడే నిద్ర మెలకు వొచ్చింది. అతని ముద్దును గ్రహించిందిగాని కళ్ళు తెరవలేదు. "చూడలేదులే పాపం! ఛీ నన్ను నరికెయ్యాలి" అనుకున్నాడు రావు. అమాంతం ఆ పిల్లను రెండు చేతులమీదా వేసుకున్నాడు. క్రిందికి బయల్దేరాడు.

క్రింద మహా చిందరవందర!

క్రిందికి వస్తుంటే ఆ వేడికీ, ఆ పొగకూ, ఆ నిప్పులకూ రావు చేతిమీదే మూర్ఛపోయింది తులసి.

క్రిందికి తెచ్చాడు. గడ్డిమీద పరుండ పెట్టాడు. అంతా చుట్టూ మూగారు. "అయ్యో అయ్యో" అంటూ చతికిలపడ్డది రాంబాయి.

డాక్టరును చూచి "వీరిద్దరినీ ఇంటికి తీసుకుపోవోయి. పరవాలేదులే—గాభరావల్ల మూర్ఛపోయిందిగాని వేరే ఏంలేదు. కాసేపటికి తెలివొస్తుంది. నువ్వే చూడు. ముదురుబారువాడ్ని నా కన్నా నీ వంటివాడు దగ్గిర ఉండి ఉపచారం చేస్తే బాగుంటుంది" అని రావు వెళ్ళిపోయాడు.

డాక్టరు గుండె కొంత కుదుటకు వచ్చింది.

జమీందారిణీ వారి యిల్లు సగం కాలిపోయింతర్వాత నిప్పు ఆర్పడం అయింది.

"ఈ సంవత్సరానికి ఇంక పార్టీలు లేవు" అన్నది జమీందారిణి.

అగ్నిప్రమాదం అయిపోయి రెండు రోజులైంది. తులసి కింకా ఐదు రోజులకన్నా సెలవులేదు. రావుకు మూడు రోజులకన్నా లేదు. డాక్టరుకు సెలవుతో అవసరంలేదు.

రాంబాయిగారు చెప్పినట్లు చేద్దాం అనుకున్నాడు డాక్టరు. రావుతో మాట్లాడాడు. తన హృదయం అంతా విప్పాడు. తనకా సంబంధం తప్పక కుదర్చాలన్నాడు.

"నేనేం పురోహితుణ్ణి టోయి! రాంబాయిగార్ని సలహా అడగరాదూ!" అన్నాడు రావు.

"రాంబాయిగారే చెప్పిందోయి. తులసికి నీ మీద చాలా గౌరవమట—నీ సలహా అంటే ఎంతో వింటుందిట. నే నిదివరకే మాట్లాడాను. చేసుకో నన్నది!"

"ముఖాముఖీ చేసుకోనన్న యుక్త వయస్కురాలు ఇతరులు చెపితే చేసుకుంటుందా!"

"సిగ్గువల్ల కొంత—కొత్తదనంవల్ల కొంతా, అట్లా అన్నదంటుంది రాంబాయి. నీ మధ్యవర్తిత్వంవల్ల మనస్సు తిరుగుతుందని గూడా ఆవిడే సలహా ఇచ్చింది."

"సిగ్గూ, కొత్తదనమేనా? లేక ఇంకా ఏదైనా కారణమా? సరే! నీ విషయంలో పాటుబడడానికి నాకేం కష్టం? చూస్తాను, నీ వింటికిపో—ఎల్లుండిదాకా చూడు. సుముఖమైతే రాంబాయిగారు కబురు చేస్తుంది." అన్నాడు రావు.

"సుముఖం కాకపోతే నే గూడా మిలిటరీలో చేరి ఫ్రంటుకు పోతా" అంటూ పోయాడు డాక్టరు.

తనలో తాను నవ్వుకున్నాడు రావు.

రాంబాయిగారి తోటలో పున్నాగ చెట్టుకింద చలువరాతి సోఫామీద కూర్చుంది తులసి. పక్కనే రంగవల్లి పందిరుంది. ఎదట రెండు కొబ్బరి చెట్లున్నాయి.

తులసి యేదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నది. రావు రాక విన బడలేదు. వెనకనే ఆమె కొప్పుముడి చూస్తూ ఓ నిముషం నిల్చున్నాడు. ఆ పూల వాసనకు తుమ్ము వచ్చింది రావుకు. ఉలికిపడి వెనక్కు చూసింది తులసి. చూడంగానే ముఖం వికసించింది. "చప్పుడూ లేదు, చెప్పడంలేదు. ఇదేనా మీ మర్యాద!" అన్నది.

"ఈ చెట్ల నీడన ఈ పూలమధ్య ఈ చలవరాతిమీద ఈ యేకాంతంలో ఈ ఏకాగ్రచిత్తంతో నీ వున్నప్పుడు యే మాలోచిస్తున్నావో అనుకుని ఊరుకున్నాను".

"ఏమాలోచిస్తున్నా ననుకున్నారు ?"

"ఏమో! చూడడానికి చిలుకను రాయబారానికి పంపేసి చూస్తూన్న దమయంతివల్లే ఉన్నావు."

"నా ఆలోచన చిలుకా, లేక మీరే చిలుకా?"

"ప్రస్తుతం నేనే చిలుకనేమో !"

"అయితే నా ఆలోచనకు సమాధానం చెప్పండి!"

"పిచ్చిపిల్లా! సమాధాన మేముందీ? సిగ్గుతోనూ, కొత్తదనంతోనూ ఊరుకుంటే ఎట్లా! డాక్టరుకన్నా మంచి వరుడు దొరుకుతాడా? పాపం అతను ఎంత దీనుడై పోయాడో చూచావుగా !" అన్నాడు రావు.

"మీరనేది నాకేం అర్థం కావడంలేదు!"

"అర్థానికేముంది తులసీ! డాక్టరు గూడా యోగ్యుడు. మనకు ముఖ్యమైనవాడు. మీ యిద్దరూ వెండ్లాడితే సొసైటీ ఎంతో సంతోషిస్తుంది."

"మీ రాయబారం ఎట్లా ఉందో చెప్పేదా?" అన్నది తులసి.

"ఇద్దరికీ ఇష్టుడనైన వాడ్ని ! నేను రాయబారం చెయ్యడంలో తప్పేముందీ?"

"తప్పు లేదులెండి! మీరు నన్ను దమయంతివలె వున్నావు అంటే జ్ఞాపకం వచ్చింది!"

"ఏం జ్ఞాపకం వచ్చింది తులసీ !"

"ఋతుపర్ణుని దగ్గరనుంచి దమయంతి దగ్గరకు నలుడు రాయబారిగా రావడం జ్ఞాపకం వచ్చింది." అంటూ— "ఇతరుల సంగతి మాట్లాడకపోతే నీ సంగతే నీవు మాట్లాడ వచ్చుగా, రావూ!"

"ఉట్టి రావుగాదు! క్యాప్టెన్ రావు!" అన్నాడు రావు.

"ఉట్టిగా పిలవడం గాదు—ఇదుగో సెల్యూట్‌తో పిలుస్తున్నాను క్యాప్టెన్!" అని సెల్యూట్ చేసింది తులసి.

"అయితే ఆర్డర్లీ రూమ్‌కి పద—రాంబాయిగారి దగ్గరకు!" అన్నాడు రావు.

"ఎందు కావిడను ఉలికించడం!"

"నిజమేలే! ఈ పున్నాగ పూలూ, ఈ రంగవల్లులూ వదిలి ఇప్పు డప్పుడే పోవద్దులే!"

"సంపెంగి పూలు లేవు!"

"పున్నాగ పూలూ, రంగవల్లులూ చాలు. కెంపులమధ్య వైడూర్యం! కొప్పులో ముడవనిస్తావా!" అని పూలు నాలుగేరుకొచ్చి కొప్పులో ముడిచాడు.

"వచ్చునో కూడదో నే ననకమునుపేనా?"

"నేను క్యాప్టెనును. నీ పర్మిషన్ అవుసరంలేదు." అంటూ ఒక చేతితో కౌగలించుకుని మెల్లిగా తలవంచి చిరునవ్వుతో సుకుమారంగా పెదవిమీద ముద్దెట్టుకున్నాడు.

"దీనికి గూడా పర్మిషన్ అక్కర్లేదా?" అన్నది తులసి.

"పున్నాగ పూలతో కొప్పుముడిచే చేయి,
రంగవల్లులతో రంగులేశే చేయి,
ఊరుకుంటుందా పిల్ల ఊరుకోమంటేను!
తీరుగా పేరెట్టి దిద్దుకుంటుంది!"

అన్నాడు రావు.